# కలువ మొగ్గా, కవితా

## 'సత్యభామ'

"కొంచెం నెమ్మదిగా నడు, తల్లీ! ఛస్తున్నా నీతో సమానంగా పరుగెత్త లేక" అంటూ కవిత భుజాన్ని పట్టుకు ఆపబోయింది లలిత. వేగం తగ్గించటమే కాకుండా పూర్తిగా ఆగిపోయింది మెట్లు ఎక్కబోతున్న కవిత. లలితకూడా కవిత పక్కనే నిలబడిపోయింది. అనుకోని సంఘటన ఎదుర్కొంటున్నట్టుగా బిత్తరపోయి నిలుచుండిపోయారు లోపలినుంచి వినవస్తున్న మాటలకి.

"ఎందుకు, చంద్రం, నాకు తెలియదా కవితా, నువ్వూ కాబోయే భార్యాభర్తలని! నా కొక్కదానికే నేమిటి? ఎవరికి తెలియదు? అందరికీ తెలిసిన విషయమేగా? మీ వాళ్లందరూ అనుకోవటం లేదూ? మేనరికమే కదా?" అది నీరజ స్వరం.

"నీరజా! మరీ అన్యాయంగా మాట్లాడకు. నిజం, నా హృదయాన్ని తెలియచేస్తున్నా, విను! అందరూ అనుకోవటం నిజమే. నే నేం అనుకోమనలేదు వాళ్ల నలా! పరిస్థితు లలా వచ్చాయి. అయినా మేనరికం ఉంటే మాత్రం అభం శుభం తెలియని ఆ పసి ప్రాయంలోనే పెళ్లి ఊహలేమిటి, చెప్పు? ఈ పెద్దవాళ్లకి బుద్ధి వక్రంగాకపోతే, అలా అనేసుకోవాలి కాబోలు, పుట్టిన వెంటనే. ఇదో చెడ్డ అలవా టయిపోయిం దీ సంప్రదాయంలో. పుట్టినప్పటి నుంచీ పెళ్లి చర్చలేనా? ఆ పిల్లలూ పెద్దవాళ్లవుతారు, ఇష్టాయిష్టాలు ఏర్పడతాయి అనే ఆలోచనే ఉండదసలు! ప్లీజ్, నీరూ! నువ్వయినా నన్ను అర్థం చేసుకో. నన్ను అర్థం చేసుకోవూ?" జాలిగా పలికింది చంద్రం స్వరం. ఆ మాటలకి లతలా వణికిపోయింది కవిత. 'ఎంత ఆర్ద్రంగా, జాలిగా ఉన్నాయి ఆ మాటలు! ఎప్పుడూ హుందాగా, సరదాగా ఉండే ఆ గళంలో ఎంత జాలీ, అర్థింపూ ధ్వనించాయి! ఎంత మార్పు!' అనుకుంది.

"అయితే, చంద్రం, నువ్వు కవిత నిష్టపడవా? ఆమెని ప్రేమించటం లేదా?" నీరజ ప్రశ్నించింది.

"ఎందుకు ఇష్టపడను! కవితని అభిమానిస్తాను, గౌరవిస్తాను. ఆమె హుషారైన స్వభావాన్నీ, భావాలనీ గౌరవిస్తాను, ఇష్టపడతాను. అయితే ప్రేమించలేదు నేను కవితని! నా భార్యగా నేను ఊహించలేను. ఎందుకో ఆ భావం లేదు నాలో. భార్యా భర్తలకీ, ప్రేయసీ ప్రియులకు కలిగే అనురాగం కాదు అది! లేదుకూడా ఆమెపట్ల! ఎందు కిలా జరిగిందో చెప్పలేను. నన్ను ఆకర్షించిందీ, నా అనురాగం పొందిందీ, నేను ప్రేమించిందీ ఒక్క వ్యక్తినే. నిజం, నీరజా! నిన్ను నేను తప్పక పెళ్లి చేసుకుంటాను! నువ్వే నా హృదయంలో నిలిచిపోయావు, మన ప్రథమ పరిచయం దగ్గరనుంచీ! నీ కెలా చెప్పాలో తెలియటం లేదు. నా హృదయం నువ్వు అర్థం చేసుకోగలిగితే. . ." ఆగాడు చంద్రం.

"నిజమా, చంద్రం! ఇది సంభవమా? నిన్ను గురించిన ప్రతి ఊహనీ కవిత గుర్తుకొచ్చి చంపుకున్నాను! అయినా ఎప్పుడూ నువ్వే మెదులుతావు, చంద్రం, నా మనసులో! ఎంత బాధ అనుభవించానో తెలుసా?"

"ఏమిటి, నీరజా, ఇంత అదృష్టమా నాకు! నీ హృదయం నాదేనా? నాకు ఎలా చెప్పాలో తెలియటం లేదు ఈ ఆనందాన్ని!" నీరజ మాటలు విన్న చంద్రం గొంతులో ఉత్సాహం ఉరకలు వేసింది.

"మరి కవిత. . .?" ఆగిపోయింది నీరజ.

"ఇంక నీ కేం భయం వద్దు, నీరూ. మన వివాహానికి ఇంక ఏ ఆటంకం లేదు! అస లెవరికీ తెలియచేయద్దు. రిజిస్టర్ మేరేజి చేసుకుందాం! కాకపోతే— ఒక్క సందేహం. . ."

"ఏమిటి?" ఆత్రంగా, కుతూహలంగా పలికింది నీరజ.

"వివాహం విషయంలో స్త్రీ పురుషు లిద్దరి పరిపూర్ణ అంగీకారాలకే నే నధిక ప్రాముఖ్యం ఇస్తాను. పెళ్లికూతుర్నే ఒక్కసారి అడగాలి! ఆమె చెప్పాలి ఆ హృదయం ఎవరిదో?" చిలిపితనం ధ్వనించింది చంద్రం గొంతులో.

"ఛ! ఫో, చంద్రం!" సిగ్గుగా అంది నీరజ. చంద్రం నవ్వు వినిపించింది.

"మనం..." ఇబ్బందిగా ఎలా పూర్తి చేయాలో తెలియక ఆగిపోయింది లలిత.

"పద, పోదాం! మళ్లీ వద్దాం నీరజ కోసం." మాట పూర్తి చేసింది కవిత.

"విన్నావా, కవీ?" నిశ్శబ్దాన్ని ఛేదించుతూ బాధగా, బొంగురుగా పలికింది లలిత!

"అదేం! బ్రహ్మాండంగా పని చేస్తున్నాయి నా చెవులకేం! ఈ డాక్టర్లు కాదు కానీ, వీళ్లతో ఇదే గొడవ. అసలు డాక్టరు ఫ్రెండ్సు ఉండకూడదు, బాబూ. ఆరోగ్యంగా ఉన్నా రోగాల పేర్లు చెపితే ఎలా? అయినా నా కేం వచ్చినా ఆఖరికి చెవుడయినా నీ ట్రీట్‌మెంటేతే నాకు!" నవ్వింది కవిత. ఆ నవ్వు పదునుగా తాకింది లలితని. దాని బదులు కవిత కళ్లలో నీళ్లు తిరిగినా బాగుండుననిపించింది. 'ఇదేమిటి, ఇలా జరిగింది జీవితంలో?' తలక్రిందులయింది కవిత. కానీ, మాటల్లో, ముఖంలో వ్యక్తపరచదేం ఆ బాధని? ఎంతగా ప్రేమించింది, ఎంతగా ఆరాధిస్తూందీ చంద్రాన్ని! ఎలా భరించగలుగుతూంది! ఎలా పలకరించాలో తెలియలేదు. సంభాషణ సాగలేదు. కవితే ఏదో అంటూంది కానీ, లలిత వినిపించుకోలేదు. అల్లకల్లోలమయిపోయింది లలిత మనస్సు. 'తన ప్రాణం, తన ప్రాణస్నేహితురాలు కవిత జీవితంలో ఇంత విషాదమా? కాకూడదు! కవిత కసలు కష్టాలు రాకూడదు!' లలితకి తల పగిలిపోతుందేమో అనిపించసాగింది. కవిత కేసి చూసింది. "అరుగో, లల్లీ! మీ వదిన మీనాక్షి మన కోసమే కాబోలు వెయిట్ చేస్తున్నారు" అంది కవిత. నిజమే. వదిన పాపతో గుమ్మంలో నిలబడి ఉంది.

"నేను రెడీ! మీదే ఆలస్యం! రిక్షాలో పోదామా? నడిచా?" మీనాక్షి ఎదుర్కొంది లలితనీ, కవితనీ. "ఇప్పుడేం వద్దు, వదినా. . ." మీనాక్షి నాపాలని అనబోతున్న లలిత ఆగిపోయింది కవిత మాటలకి.

"మీరే చెప్పాలండీ. పాప నయితే నేను ఎత్తుకోగలను. కానీ, మీ సంగతే అనుమానంగా ఉంది! లేకపోతే నడిచి వెళ్లటానికింకేం అభ్యంతరం?" మీనాక్షి నవ్వులో కలపలేకపోయింది తన నవ్వును లలిత.

"మరీ అన్యాయంగా మాట్లాడకోయ్, కవితా! అసలు నువ్వు నాతో నడవగలవా ఏమిటి? నన్నంత తీసి పారెయ్యకమ్మాయీ." ముక్కుమీద కోపంతో అంది మీనాక్షి.

"ఓ! తప్పకుండా! అయితే మనం పోటాపోటీలుగా నడుస్తుంటే లలిత జనాన్ని సర్దాలేమో! ఏం లలితా? చూడలేక జనం మన పోటీ ఆపించటానికి సినిమా డబ్బులన్నా వచ్చేలా ఇస్తారంటారా?" కవిత అంది.

"వచ్చినట్టు ఇస్తారు! ఇంతకీ ఏ సినిమాకి వెళదాం?" మీనాక్షి అడిగింది నవ్వుతూ.

"మీ ఇష్టం! ఏ రోడ్డు అయితే మన పోటీకి అవుతో చూడండి. నేను, అయిదు నిమిషాలలో వచ్చేస్తాను! అరే, పాప అప్పుడే తయారయిపోయిందే!

**బాధను వ్యక్తం చేసినా, చేయకపోయినా అనుభవంలో అందరికీ ఒకటే బాధ అనుకున్న విధంగా ఆశించిన మార్గంలో అందరి జీవితాలూ నడిస్తే భగవంతుని ఉనికికి విలువ కనిపించదు. చిన్ననాటి పరిచయాలు ప్రేమబంధం కావాలనుకొనే పెద్దల ఆశకు మారుతూన్న కాలపు విలువలు సరిపోవడం అవసరమేమో!**


అమ్మో! కొత్త గౌనుకూడా వేసిందే! ఎంత బాగుందో! నా క్కూడా ఇవ్వవూ, పాపా, కొత్త గౌను!" బుజ్జగింపుగా బతిమాలుతున్నట్టు అడిగింది కవిత.

"ఆకుపచ్చది కావాలా? గులాబీదా! దా! ఇత్తాను." ముద్దు ముద్దుగా అంది పాప. "లా! మరి!" అంటూ కవిత చెయ్యి పుచ్చుకు తీసుకెళ్లింది పాప.

"అదేం అలా నిలబడిపోయావు! తయారవు. చీర మార్చుకుంటావా?" మీనాక్షి మాటలకు కలలోంచి మేల్కొన్నట్టు లోపలికి దారి తీసింది లలిత. ఆ రోజు సినిమా చూసింది ఏకాగ్రతగా, శ్రద్ధగా మీనాక్షి ఒక్కతే!

• • •

"అన్యాయమండోయ్ ఇంకా పడుకోవటం! రాత్రి పోనీ గెలిచారా అంటే ఓడిపోయారుకూడాను." కవిత మాటలతో మెలుకువ వచ్చింది మీనాక్షికి. "ఆహా! ఏమి నా భాగ్యం! పొద్దున్నే ఈ చందమామ ముఖం చూడగలగటం! స్నానం కూడా చేశావేమిటి అప్పుడే! టైమ్ ఎంతయింది? ఆరు గంటలకే ఈ మేకప్ అంతా, ఏమిటి కథ! అదేమిటి, ఆ బాగ్ ఏమిటి?" మీనాక్షి వాక్ప్రవాహం ఆగిపోయింది.



"ఏమిటంటీ ఇంకా నిద్ర మెలుకువ రాలే? నేను మా ఊరు వెళుతున్నానండీ! చెప్దామని లేపాను." పాప దుప్పటి లాగుతూ అంది కవిత.

"అదేమిటి? ఇప్పుడు ప్రయాణం ఏమిటీ! ఎంత ధైర్యం నీకు! వెళ్లిపోవటం నీ ఇష్టమేనా? ఇదేమిటి, లలితా! మీ అన్నయ్య ఈ వేళ వస్తానన్నారు కదా! నెల రోజు లుండేట్టు వస్తానన్నావు క్రిందటిసారి! మూడు రోజులేగా అయింది! లలితా, నువ్వలా ఊరుకుంటావేమిటి?" మీనాక్షికి ఆశ్చర్యంగా ఉంది.

"పోనీ, నారం వద్దులే. రెండు రోజులుండు, కవితా! నువ్వసలు వచ్చినట్టే లేదు!" లలిత కళ్లలో నీళ్లు.

"ఛీ! ఎందుకేడుపు? అలా ప్రతిదానికీ కళ్లనీళ్లు అయితే లాభం లేదమ్మాయీ! అయినా డాక్టర్‌వి కదా! దీనికేం మందు లేదా? కళ్లనీళ్లు రాకుండా ఉండటానికేం మందూ లేదా? పోనీ, నువ్వు కనిపెట్టవోయ్." నవ్వుతూ అంది కవిత.

"ఎలా నవ్వగలుగుతున్నావ్, కవితా!" రాత్రి నిద్ర పట్టక దొర్లుతూ, కళ్లు మూసుకుని తలుపు తీసిన శబ్దానికి కళ్లు తెరిచిన లలితకి తలుపు తీసి చీకటిలో వరండా స్తంభాన్నానుకుని నిలబడిన కవిత జ్ఞాపకం వచ్చింది. రివ్వున చలిగాలి వీస్తోంది. ఎంతసేపటికీ కదలలేదు అక్కడినుంచి కవిత. లలిత కెందుకో భయం వేసింది. అందుకే దాని దగ్గ

వచ్చింది. ఆ చప్పుడుకి నెమ్మదిగా వచ్చి తలుపేసి మంచం చేరింది కవిత. కానీ, చాలాసేపు అలా కూర్చునే ఉండిపోయింది! ఇంక తను ఆగలేక లేచి కూర్చుంటూ "నువ్వు పడుకోలేదూ!" అని పలకరించిన కవితకి, "ఎలా వస్తుంది, కవితా! నువ్వు పడుకోండే!" అని తను సమాధానంగా అంది. "లల్లీ!" అంటూ లలిత మీద వాలి, "ఎంత మంచి స్నేహితురాలివయినా, నాతోపాటు ఇంత బాధ నీకెందుకు? చాలు లల్లీ, నీ స్నేహం ఒక్కటి చాలు, నే నెప్పుడూ బ్రతుకుతాను దాని కోసమే!" అంటూ అలానే ఉండిపోయింది కవిత. బెడ్‌లైట్ వెలుగులో కవిత కళ్లలో తడి అప్పుడే మొదటిసారిగా చూసింది లలిత. "ఎలా, కవీ, నువ్వెలా ఉంటావు ఇంక? ఎలా ఉండగలుగుతున్నావ్?" అంది తను రుద్ధ కంఠంతో. "లలితా! బాధ వ్యక్తం చేసినా, చెయ్యకపోయినా అనుభవంలో అందరికీ ఒకటే బాధ! వక్రించింది నా జీవరేఖ! అనుకున్న విధంగా, ఆశించిన మార్గంలో అందరి జీవితాలూ నడిస్తే భగవంతుని ఉనికికి విలువేమిటి, లల్లీ!" రాత్రి కవిత మాటలన్నీ గుర్తుకొచ్చాయి!

"అలా నవ్వకు! నువ్వు సీరియస్‌గా అయినా ఉండు; లేకపోతే బాధ నయినా వ్యక్తం చెయ్యి!" గొణుక్కుంది లలిత.

"వస్తాను, లల్లీ!" ఆ కళ్లలో ఎంతో విషాదం, ఆ స్వరంలో ఏదో మార్పు. తనకు తెలిసిన కవిత కాదు. "కవితా!" ఒక్కసారి పెల్లుబికిన దుఃఖంతో అల్లుకుపోయింది కవితని లలిత. "పిచ్చీ! ఎందుకింత ఆవేశం! అతి సర్వత్ర వర్జయేత్" అన్నా రమ్మాయ్. చూడు, ఎక్కువ అయితే ఏదయినా బాధే! ఏమంటావు! అలా పిలిస్తే వస్తాయే నీకు కళ్లనీళ్లు!" లలిత కళ్లు తుడిచేస్తూ 'మళ్లీ వస్తానని మావాళ్ళకీ, పాపకీ వచ్చు చెప్పి బయలుదేరింది కవిత.

"లెటర్ వ్రాయి, కవీ!"

"ఎందుకు వ్రాయను? నీకు కాక ఎవరికి వ్రాస్తాను?" లలిత భుజం తట్టింది కవిత.

• • •

"చెప్పే పని అయినా, చేసేదయినా అర్థం ఉండాలి. ఎందుకొచ్చిన చదువులు, ఆలోచన అనేది లేకపోయాక! అసలు నీకు మతిగాని పోయిందా ఏమిటి? అంత దూరప్రయాణం ఇప్పుడెందుకు? ఇప్పుడా రాధికని చూసే సమయం?" సీతమ్మగారి గొంతు గయ్‌మని ధ్వనించింది.

"ఏమిటే అరుపులూ? ఏమంటుంది?" బొమ్మకూడా రంగంలో ప్రవేశిస్తుంటే కవిత ధైర్యాన్ని కూడగట్టుకుంది.

"చూడండి దీని మాటలు! దీని స్నేహితురాలు రాధ లేదూ! ఇప్పుడు అక్కడికి వెళుతుందిట! ఏమన్నా అర్థమున్నమాటలేనా అంట! ఓ దగ్గిరా దాపా? ప్రయాణమే రెండు రోజులు పడుతుంది కదా? అసలు అనవసరం గారాంచేస్తే ఇలానే ఉంటుంది. చిన్నప్పటినుంచి ఆడింది ఆట. పాడింది పాట! మరి ఇప్పుడు ఇలాగ అవక ఏం చేస్తుంది?" కోపంతో ఎలా చెప్పాలో తెలియక అత్తగారివైపు మళ్లింది సీతమ్మగారి వాగ్ధాటి!

"నువ్వూరుకో ముందు! అదెందుకు వెళుతుంది? నెల రోజుల్లో పెళ్లి కదా! శుభలేఖ పంపుదువుగాని, కవితా, ఆ రాధే వస్తుంది రెక్కలు కట్టుకుని. అసలు ముహూర్తం ఒక నెల రోజులలో ఉందిట— మొన్న సిద్ధాంతిగారు ఏదో మాటల మీద అన్నారు. చంద్రంకూడా ఈ వేళో రేపో వస్తాడు. వాడి సెలవులూ అవీ చూసుకుని ముహూర్తం పెట్టుకోవటమే కదా? అయినా, అమ్మడూ, కాస్త ఆగవే, తల్లీ. రేపటినుంచీ నీ ఇష్టం వచ్చినన్ని ప్రయాణాలు చేయొచ్చు మీ ఆయన నడిగి! మేమేం అడ్డు పడం! కొత్తవాడా ఏమన్నానా— బావేగా!" ముసిముసిగా నవ్వుతూ ముగించిన బొమ్మ ప్రసంగం మనమరాలు కవిత పూర్తిగా వినలేదు. అక్కడినుంచి ఎప్పుడో వెళ్లిపోయింది.

"ఎందుకే ఆ సూట్‌కేసు సర్దుతున్నావ్! అన్ని చీరలు తీశావేమిటే?" సీతమ్మగారి కంఠం కోపంగా పలికింది.

"చెప్పాను కదమ్మా! రాధా వాళ్ల ఊరు వెళుతున్నానని?" నెమ్మదిగా అయినా, దృఢంగా పలికింది కవిత స్వరం.



దాగుడుమూతలు

ఫోటో—ఆర్. ఉదయభాస్కర్ (తిరుచ్చి)

కూతురి మొండితనానికి విసుగేసిందావిడకి. కోపం తారాస్థాయి నందుకుంది.

"అయితే నీ ప్రయాణం ఆపవన్న మాట! నీ కసలు అదుపు, ఆజ్ఞ పోయాయే. అనవసరంగా గారాంచేసి అమ్మా, నాన్న అనే అధికారాల్నే పోగొట్టుకున్నాం! అమ్మ చెపుతూంది, ప్రయాణం మానెయ్యాలి అని నీకు అనిపించిందా? ఎందుకు బ్రతికుంటి! నీ మాట నీకు. అమ్మ ఎప్పుడో చచ్చిపోయింది నీకు." సీతమ్మగారి స్వరంలో దుఃఖపు జీర తొంగిచూసింది. "అమ్మా!" అదుర్దాగా వణుకుతూ ఆపబోతున్నట్టుగా అంది కవిత. "అలా అనకమ్మా!" ఆర్తనాదంలా వచ్చింది కవిత స్వరం.

"ఎందుకు వచ్చిన అమ్మే నీకు! నీ ఇష్టం నీది, నీ స్నేహితులు నీకు. ఏదో బ్రతికున్నాం కనక ఇంకా ఏదో చెప్పాలని, చూడాలని అనుకుంటాం! నీ కేమాత్రం గౌరవమున్నా మా మీద, ఏమాత్రం విచక్షణ జ్ఞానం ఉన్నా ఇలా చేస్తావా? నీ తెలివితేటలు ఇందుకు పనికి వచ్చాయన్న మాట! పెళ్లి ముందు పెట్టుకుని ఇలా దూరప్రయాణాలు, ఈ కాంపులు ఇవేం తెలివితేటలో నా కర్థం కావటం లేదు." తీవ్రంగా అంది సీతమ్మ.

"ఏమిటి పొద్దుటినుంచీ ఉపన్యాసాలతో అదరగొట్టేస్తున్నావ్?" రంగనాథం లోపలికి వస్తూనే ఆగిపోయారు, సీతమ్మగారు కళ్లు ఒత్తుకోవటం చూసి.

"అవును! మీ కన్నీ ఉపన్యాసాలులానే ఉంటాయి! చూశారా కూతురి చదువుల ఉపయోగం! ఇదెక్కడి స్వభావం అంట! ఈవేళో రేపో అతను రాబోతూంటే, దీని ప్రయాణం ఏమిటండీ? ఎంత దూరం! మీ రన్నా చెప్పండి. ఆపండి దాని ప్రయాణాన్ని!"

కవిత కేసి చూశారు రంగనాథంగారు. కవిత తల వంచుకుంది.

"ఏమండీ! మాట్లాడరేం? పెళ్లి ముందు పెట్టుకుని. . ."

"ఎవరికి, సీతా, పెళ్లి? పెళ్లికొడుకుకీ, పెళ్లికూతురుకీ ఇష్టంలేకుండా! పోనీ, ప్రయత్నా లాపకుండా షష్టిపూర్తి జరుపుకుందా మనుకున్నా—అరవై నిండి ఆరేళ్లు కావస్తూంది!" హాస్యంగా పలకాలనే ప్రయత్నం రంగనాథంగారి గొంతులో.

"ఇదెక్కడి హాస్యమండీ! పెళ్లికూతురికీ, పెళ్లికొడుక్కీ ఇష్టం లేకపోవటమేమిటండీ!?" గందరగోళమైన మనస్సుతో నుదురు పట్టుకుంది సీతమ్మగారు. స్వరం పూర్తిగా దుఃఖమయింది.

"ఎందుకు, సీతా, అలా గొంతు చించుకుంటావ్! కవిత కిష్టం లేదుట ఈ

పెళ్లి!'' ఉలిక్కిపడింది కవిత. ఇష్టం లేనిది కవితకా! రాత్రి నాన్నగారితో సంభాషణ అంతా జ్ఞాపక మొచ్చింది.

మంచినీళ్ల చెంబు గూట్లో పెట్టి 'నాన్నా' అని నెమ్మదిగా పిలిచింది.

[illegible] పరీక్షలై పోయాయి కదా! ఏమిటి విశేషాలు? బామ్మ తొందర పడుతూంది, తల్లీ! మీ పెళ్లి చూసి వెళ్లిపోతుందిట తను! ఈ నెలలో ముహూర్తా లున్నాయట!'

'పెళ్లంటే ఇద్దరి వ్యక్తులలో ఒకరంటే ఒకరికి ఇష్టం, ఒకరంటే ఒకరికి పరిపూర్ణ అనురాగం కలగాలని నమ్ముతారా, నాన్నా, మీరు?'

'ఎందుకు అక్కరలేదు, తల్లీ! నీకు చూసేది పై సంబంధమేమీ కాదుగా, అమ్మా? బావేగా! మీ ఇద్దరి విషయంలో ఆ అనుమానం. . .'

'అవును, నాన్నా! అనుమానమే కాదు, ఆ కలయిక, ఆ అనురాగం మాలో లేదు, నాన్నా!' కవిత స్వరం కంపించింది.

'అమ్మా, కవితా! ఇది నిజమా! ఎందుకు. . .' ఆశ్చర్యంకన్నా ఎక్కువ ఆందోళనగా వచ్చింది రంగనాథంగారి స్వరం!

'నిజం, నాన్నా! చిన్నప్పటినుంచీ అమ్మ దగ్గిరకన్నా నాకు మీ దగ్గిరే చనువు ఎక్కువ! అమ్మకి మీరే చెప్పండి! ఇది ఆవేశంగా, మూర్ఖంగా, తొందరపాటుతో చేసుకున్న నిర్ణయం కాదు! నాకు బాధగానే ఉంది, నాన్నా! కానీ, ఈ పెళ్లి ఆగిపోవాలి!'

'అసలేం జరిగింది, తల్లీ! ని న్నెప్పుడు బాధపెట్టాను కనక! ఎంతో వివేకవంతురాలి వనుకున్న న న్వీ నిర్ణయం ఎందుకు తీసుకున్నావో, ఎందు కిలా మారిపోయావో అర్థం కావటం లేదు! చూడమ్మాయ్, నాకున్న అనుభవంలో నీ వయసెంత, అమ్మా! నీవు అంతా వివరంగా చెప్పు. అప్పుడు నాకూ నీలానే అనిపిస్తే. . .'

'వద్దు, నాన్నా! కారణం అడగకండి. తెలివితేటలమీద మీ కేమాత్రం నమ్మకమున్నా మీ రింక ఆలోచించకండి! తొందరపడటం లేదని నాకుపూర్తిగా తెలుసు, నాన్నా!'

'రేపు చంద్రం వచ్చి అడిగితే ఏం చెప్పమంటావు, తల్లీ!'

వర్షించటానికి సిద్ధంగా ఉన్న కవిత కళ్లు ఎర్రగా మారాయి.

'నేను. . . నేను రాధ దగ్గిరకి వెళ్లి కొన్నాళ్లు ఉండి వస్తాను, నాన్నా! నన్ను క్షమించండి, నాన్నా, మిమ్మల్నిలా బాధ పెడుతున్నందుకు.' తండ్రి పాదాల దగ్గిరగా ఒరిగిపోయింది కవిత.

# మద్రాసు సంగీత కళాశాల రజతోత్సవం



సంగీత కళాశాల రజతోత్సవాల సందర్భంలో విద్యార్థినులు కానుకగా సమర్పించిన వెండి వీణను గవర్నర్ శ్రీ షా పార్థసారథి దంపతులకు అందజేస్తున్న దృశ్యం

మద్రాసు గోపాలపురంలోని సంగీతకళాశాల రజతోత్సవం ఇటీవల తమిళనాడు గవర్నర్ శ్రీ కె. కె. షా అధ్యక్షతన వైభవోపేతంగా జరిగింది. ఎగ్మూర్‌లోని వెల్లింగ్డన్ లేడీస్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమం గవర్నర్ జ్యోతిని వెలిగించడంతో ప్రారంభం అయింది.

శ్రీ ఎన్. సి. పార్థసారధి గవర్నర్‌కు, ఆహూతులకు స్వాగతం పలికారు. గవర్నర్ జ్యోతిని వెలిగించిన అనంతరం ప్రిన్సిపాల్స్ శ్రీ పార్థసారధిదంపతులు జ్యోతులను వెలిగించారు.

గవర్నర్ శ్రీ కె. కె. షా తన ప్రసంగంలో సంగీత కళాశాల కార్యక్రమాలు, శిక్షణ విధానాలు చాలా చక్కగా ఉన్నవని అభినందించారు. భవిష్యత్‌లో ఈ కళాశాల మరింత ప్రగతిని సాధించగలదన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

పార్థసారధి దంపతులు నిర్వహిస్తున్న ఈ కళాశాలలో 1943 సంవత్సరం నుంచి 1972 దాకా చదివినవారిలో 25 మంది విద్యార్థినులు రజతోత్సవాల చిహ్నంగా జ్యోతులు వెలిగించిన దృశ్యం, 36 వాద్యాలతో సంగీత కార్యక్రమం రసజ్ఞులను ఆనందపరచింది.

ప్రొఫెసర్ శ్రీ పి. సాంబమూర్తి, శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ కళాశాల కార్యక్రమాలను గురించి వివరించి పార్థసారధి దంపతుల కళాసేవను ప్రస్తుతించారు.

శ్రీయుతులు సర్వేపల్లి రాధాకృష్ణ, ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, మద్రాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ సుందరవడివేలు ప్రభృతులు పంపిన సందేశాలను కుమారి సులోచన చదివారు. నివేదికను శ్రీరాం చదివారు. కుమారి రాజేశ్వరి వందన సమర్పణ చేశారు. *

'అమ్మా, కవితా!' ఆత్రంగా, ఆదుర్దాగా కవితని లేవనెత్తి తల నిమురుతూ, 'నీ ఇష్టప్రకారమే కానియ్యి, తల్లీ! ఏది జరిగితే అదే జరుగుతుంది. అంతా ఆ దైవం నిర్ణయం ప్రకారమే జరుగుతుంది!' అన్నాడు. తరవాత కవిత మెల్లగా కదిలి ఆ గదిలోంచి వచ్చేసింది! ఆ రాత్రల్లా కవిత గదిలోని కిటికీరెక్క మూయలేదు! అలాచీకటిలోకి, శూన్యంలోకి ఏమి వెతుకుతున్నాయో కానీ, చూస్తూనే ఉన్నాయి కవిత కళ్లు.

అయితే, నాన్న అనుకోవటం పావని తనే వద్దందనా? అసలే ఇష్టంలేదా బావంటే! కవితకేనా చంద్రం అంటే ఇష్టం లేనిది? కవిత హృదయం రోదిం

చింది. అయినా, పైకి తెలియనివ్వకుండా తల వంచుకుని తెల్లచీరలోని జరీని సాపుగా చేస్తూ నిశ్శబ్దంగా ఉండి పోయింది.

"సెంద్రంబాబుగారు వచ్చా రండోయ్!" వాకిట్లోంచి పాలేరు వేసిన కేకకి ముగ్గురూ ఉలిక్కిపడ్డారు. ఎవరికి వారు హడావిడి పడిపోయారు. తల్లీ, తండ్రీ ఆ గదిలోంచి చెరో వైపు గంభీరమైన ముఖాలతో వెళ్లి పోతూంటే, కవిత ఆ విషాద ముఖాల ఆ నిస్తబ్ధ సన్నివేశానికి వచ్చే ఉద్వేగాన్ని అణుచుకో ప్రయత్నిస్తూ బట్టలన్నీ చకచకా సర్దసాగింది.

• • •

ఇంటి వెనక వైపు ఉన్న చెరువు గట్టుమీద పారిజాతపు చెట్టుక్రింద కూర్చున్న కవిత— "ఇక్కడున్నావా?" అన్న మాటలకి ఉలిక్కిపడింది.

"నువ్వా! రా, బావా?" పొద్దుటి నుంచీ తప్పించుకు తిరిగినా, తప్పనిసరిగా ఎదురైన చంద్రాన్ని చూసేసరికి తొట్రుపడుతూ అంది కవిత.

"ఏం చేస్తున్నావు ఇక్కడ? ప్రకృతి పరిశీలనా?" పడమటి దిశలో కొబ్బరి చెట్లచాటుకి క్రిందగా దిగిపోలు కొంచెంగా కనిపిస్తున్న భానుబింబాన్ని, ఆ ప్రదేశంలో ఆకాశం అంతా ఏర్పడిన ఎరుపు రంగుని చూస్తూ అన్నాడు చంద్రం, అక్కడే చదికిలబడుతూ తనుకూడా!

నవ్వింది కవిత. "అయితే, రాధా వాళ్ల ఊరు వెళుతున్నావా? మళ్లీ ఎప్పుడొస్తావు?" చంద్రం ప్రశ్నకి ఉలిక్కిపడింది కవిత. 'నాన్న చెప్పేశారా అంతా?' పరిశీలనగా చంద్రం ముఖంకేసి చూస్తూ, "నీ పెళ్లికి రావాలిగా?" అంది కవిత.

గట్టిగా నవ్వేస్తూ, "నువ్వు రాకపోతే ఎలా? నీరజ ఊరుకుంటుందా?" అని నాలిక కొరుక్కున్నాడు చంద్రం. మళ్లీ సర్దుకుంటూ— "అన్నట్టు నీకు చెపుదామని అనుకుంటున్నాను, కవితా! నీరజా, నేనూ పెళ్లి చేసుకోబోతున్నాం! ఇక్కడ అత్తయ్య, మామయ్య, అమ్మలకి ఎలా చెప్పాలా అని సతమతమయ్యా ననుకో. కానీ, మామయ్య చెప్పాడు ఇందాక—నువ్వు మన పెళ్లి ఇష్టం లేదని చెప్పావట కదా! నిజంగా నిన్నభినందిస్తున్నాను, కవితా! ఎందుకంటే, నువ్వెప్పుడూ ధైర్యంగా ఉంటావు! నేనైతే మామయ్యకు ఎలా చెప్పాలో తెలియక బుర్ర పగులగొట్టుకుంటున్నా! అయినా, మన సంప్రదాయంలో ఇది ఒక చెడ్డ అలవాటయిపోయింది కదూ? మేనరికం ఉండగానే అంత పసి ప్రాయంలో ఆ మాట లెందుకు? దాన్ని లెక్క వెయ్యటం ఏమిటి నా మొహం!? సరే, నా పెళ్లికే వస్తావని అన్నావు. మరి నీ పెళ్లిమాటేమిటి?" 'నువ్వెవరిని ప్రేమించావు?' అన్నట్టుగా తోచింది ఆ ప్రశ్నలోని భావం కవితకి! "ఏం మాట్లాడవు, కవితా?" ఏంమాట్లాడాలో తెలియని కవిత క్రిందగా తల వాల్చి చెరువు గట్టుమీద రాగిడిమట్టికేసి చూస్తున్న కవిత చటుక్కున లేచి ఆ మట్టిగడ్డల మధ్యలో పడి ఉన్న, తెంపివేయబడి ఉన్న కలువమొగ్గను చేతిలోకి తీసుకుంది! కవిత చెవులలో హోరులా వినిపిస్తూంది బావ మాట్లాడిన మాటలలో—'నువ్వెప్పుడూ ధైర్యంగా ఉంటావు!' అన్నది. అవును, ఉంటాను. అందుకే ఇలా ఉన్నాను! పైకి అనలేని ఆ మాటలని తప్పించి చేతిలో ముడుచుకు పోయి వడిలిన ఆ మొగ్గ కేసి చూస్తూ "ఇది ఇంక వికసించదా, బావా? చూశావా ఎలాతెంపిపడేశారో ఎవరో?" అనిఒక్కొక్క రేకనే విడదీయాలని చూస్తూ నిమురుతున్నట్టుగా ముఖం దగ్గరగా ఆ మొగ్గని చేర్చుకుంటూ అంది కవిత.

"బావా! నీళ్లలో [illegible] ఉంచితే విచ్చుతుందేమో కదూ? ఏమైనా కాడ నుంచి వేరయింది కదూ? చెరువులో పూచిన ఆ అందం రాదు!"

"ఎలా వస్తుంది? అదైనా ఇప్పుడు మనం తీసుకువెళ్లి ఏ తొట్టిలోనో, ఎక్కడైనా నీళ్లలోనో వేస్తే ఏదో విచ్చుతుంది పిచ్చిగా! అంతే. ఆ సొగసు, ఆ అందం దీని కెక్కడి నుంచి వస్తాయి?" కవిత స్వరం నెమ్మదిగా వణుకుతున్నట్టుగా వచ్చింది.

"ఎందుకు, కవితా, దాన్ని గురించి అంత ఆలోచిస్తావు? అన్ని మొగ్గలా పూస్తాయా? మధ్యలో అకారణంగా తెంపి వెయ్యబడవూ? అందులో ఇదొకటి! పద, చీకటి పడిపోయింది." లేచాడు చంద్రం. "అవును. అన్ని మొగ్గలకీ అంత అదృష్టం ఉండదు." గొణుక్కుంటున్నట్టుగా అంటూ చంద్రాన్ని అనుసరించింది కవిత.

• • •

"ఎలా ఉంది, లలితా, నీ తలనొప్పి! ఏం తగ్గలేదా?" నీరజ పలకరింపుకి పెళ్లిపందిరినుంచి వినవడుతున్న సందడితో నిద్ర పట్టక కళ్లు మూసుకుని పడుకుని ఉన్న లలిత కళ్లు తెరిచి లేచి కూర్చుంది.

"అంత తొందరగా తగ్గే తలనొప్పి కాదులే ఇది! ఏమి టలా కళ్లు ఎర్రగా ఉన్నాయి నీవి?"

"అబ్బ! ఆ పొగలో కూర్చున్నా కదూ ఇందాకటినుంచీ!" చిన్నగా నవ్వుతూ సిగ్గుగా అంది నీరజ. నాగవల్లి నుంచి అప్పుడే వచ్చినట్టుంది.

"ఇంతకీ నువ్వు చూశావా, కవిత గ్రీటింగ్సు? ఈ పెయింటింగ్ పంపింది. చూడు, చాలా బాగుంది కదూ? ఎంత బాగా వేసిందో!" ప్రక్కనున్న పెట్టె మీదున్న కవరులోంచి తీసి లలితకి చూపించిం దా చిత్రాన్ని నీరజ.

"అందమైన ప్రకృతి అంతా ఒక్క చోట నిలబెట్టినట్టు ఉంది కదూ! ఎన్ని రంగుల రకాల పువ్వులో! ఎన్ని పళ్ల చెట్లో! చాలా సహజంగా ఉన్నాయి కదూ ఆ రంగులన్నీ! మామిడిచెట్టుని పెనవేసుకున్న ఆ లతా, అందమైన ఆ లేతనీలపు ఆకాశంలోకి ఎగురుతున్న ఆ చిలుకలు రెండూ ఎంత బాగున్నాయి! చాలా బాగా వేసింది కదూ?" నీరజ మాటలు వింటూ చిత్రం చూస్తున్న లలిత ఒక్కసారి ఉలిక్కిపడింది, ఆకుపచ్చని ఆకులమధ్య ఒంటరిగా ఉన్న ఆ ఆకుపచ్చని చిలుకని చూసి. అది ఎంతో పరీక్షగా చూస్తే కానీ కనపడటం లేదు.

"ఏం మాట్లాడవు, లలితా? అబ్బ, నే పది మాటాడుతుంటే నువ్వొక్క మాటా మాట్లాడవే! తలనొప్పి ఈ మధ్య బాగా వస్తోందని అంటున్నా వినిపించుకోకుండా పెళ్లికి తీసుకువచ్చాననా?"

"అదేం కాదు, నీరజా! తలనొప్పి వల్లే. విపరీతంగా వస్తోంది కదూ? కొంచెం మంచినీళ్లు కావాలి, నీరజా. మీ వాళ్ల ఎవరితోనన్నా చెప్పవూ?" కన్నీళ్లని ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ తల మోకాళ్ల మధ్య ఆన్చుతూ అంది లలిత. ఒళ్లో పెట్టిన చిత్రంమీద లలిత కన్నీళ్లు పడనే పడ్డాయి! అదీ సరిగ్గా ఆకుల మధ్య దాగి ఉన్న ఆ ఒంటరి చిలుకమీదే! *



ఏకాంత సేవ

చిత్రం—పి. ఎస్. చంద్రశేఖర్ (కమ్మరగూడెం)